సాక్షి
నల్లగొండ
ఆదివారం । 21 । జనవరి । 2024



వైద్య రంగానికి పెద్దపీట

వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నామని కేంద్ర విద్యుత్, ఇంధన శాఖ మంత్రి ఆర్కే సింగ్ పేర్కొన్నారు. - 8లో



బత్తాయి మొక్కల నరికివేత

పెద్దవూర మండలంలోని ఉట్లపల్లిలో ఓ రైతు తోటలో బత్తాయి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. - 8లో



కేవీకే శాస్త్రవేత్తకు అవార్డు

రైతులకు విశేష సేవలు అందించిన గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కు ఏరువాక వార్షిక అవార్డు దక్కింది. - 8లో

ఆయకట్టులో నీటి గోస

- అడుగంటున్న చెరువులు.. పడిపోతున్న భూగర్భ జలాలు
- పంటలను కాపాడుకునేందుకు రైతుల అష్టకష్టాలు
- భారీగా బోర్లు వేసి ఆర్థికంగా చితికిపోతున్న అన్నదాతలు
- సాగర్ నీటితో చెరువులు నింపాలని వేడుకోలు



జి.చెన్నారం చెరువులో అడుగంటిన నీరు

నల్లగొండ రూరల్ : జిల్లాలో నాగార్జునసాగర్, ఏఎమ్మార్పీ ఆయకట్టులో రైతులు నీటికోసం గోస తీస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగర్ నుంచి ఆయకట్టుకు నీటి విడుదల చేయలేదు. దీంతో బోర్లు, బావులు, చెరువుల ఆధారంగానే రైతులు సాగు చేపట్టారు. ప్రసుతం చెరువుల్లో నీరు అడుగంటడంతో.. భూగర్భ జలాలు కూడా తగ్గాయి. దీంతో వేసిన పంటలు కూడా ఎండిపోతున్నాయి. ఈ పరిస్థితిలో కనీసం చెరువులు నింపేందుకైనా నీటిని విడుదల చేస్తే భూగర్భ జలాలు పెరిగి పంటలు దక్కుతాయని రైతులు పేర్కొంటున్నారు.



దర్వేశిపురం వద్ద వేస్తున్న బోరు

సగం భూముల్లోనే సాగు..

వానాకాలంలో, యాసంగిలో సగం భూముల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. ఏఎమ్మార్పీ కింద లక్ష ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా.. యాసంగిలో 30 వేల ఎకరాల్లోనే నాట్లు వేశారు. సాగర్ ఎడమ కాల్వ పరిధిలో 3.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా.. యాసంగిలో కేవలం 75 వేల ఎకరాల్లోనే సాగైంది.

వానాకాలంలోనూ అంతంతే..

కాల్వల నుంచి నీటి విడుదల లేకపోవడం వరి సాగును వదిలేయలేక చాలా మంది రైతులు బోర్ల ఆధారంగా సాగు చేపట్టారు. వానాకాలంలోనే వేసిన వరి పంటలను కాపాడుకునేందుకు రైతులు ఆరుతడి తరహాలోనే నీరందించి పంటను గట్టెక్కించుకున్నారు. ఈ యాసంగిలో వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించారు. నీటి లభ్యత మేరకే సాగు చేపట్టారు. మరికొందరు రైతుల బోర్లు ఇంకిపోవడంతో నాట్లు వేసిన రెండు నెలల తర్వాత పంటలను వదిలేశారు.

చెరువులు నింపాలంటున్న రైతులు..

జిల్లాలోని చెరువుల్లో వేసవిలో చేపల వేట కోసం కొన్ని చెరువుల్లో నీటిని కిందికి విడుదల చేయడంతో నిల్వ తగ్గిపోయింది. ప్రస్తుతం కొన్ని చెరువులు ఎండిపోయే దశలో ఉండగా.. మరి కొన్నింటిలో కేవలం 10 నుంచి 20 శాతం మాత్రమే నీరు ఉంది. దీంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. కాల్వల ద్వారా నీరు విడుదల లేకపోవడంతో చెరువులు అడుగంటి భూగర్భ జలాలు పడిపోతున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే వచ్చే వేసవిలో తాగునీటికి సైతం కష్టాలు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 40 వేల ఎకరాల్లో పండ్ల తోటల ఉన్నాయి. ఇవి కూడా బోర్లు, బావుల ఆధారంగానే సాగవుతున్నాయి. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటడంతో తోటలను ఎలా కాపాడుకోవాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు కొందరు రైతులు బోర్లు వేస్తున్నారు. దీంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. చెరువులు నింపేందుకు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



నల్లగొండ మండలం అనంతారం వద్ద ఎండిన వరి నాట్లు

పంటను కాపాడుకునేందుకు నాలుగు బోర్లు వేశా..



మూడు బోర్ల ఆధారంగా ఏడెకరాల్లో వరి సాగు చేశాను. ఏఎమ్మార్పీ డి–37 ద్వారా నీరు రాకపోవడంతో బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. వరి పంటను గట్టెక్కించుకునేందుకు మరో నాలుగు బోర్లు వేస్తే ఒక్క బోరులో స్వల్పంగా నీటి లభ్యత ఉంది. ఆరుతడి తరహాలో చేనుకు నీరందిస్తున్నా. ఒక్క బోరు వేస్తే రూ.30 వేల భారం పడుతోంది.

– ఉప్పునూతల శ్రీను, రైతు, జి.చెన్నారం, నల్లగొండ మండలం

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ హరిచందన దాసరి



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలోని అర్హులైన పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలని కలెక్టర్ హరిచందన కోరారు. శనివారం కలెక్టరేట్ ఆమె విలేకరులతో మాట్లాడారు. గతంలో ఓటు వేసిన వారు కూడా తిరిగి కొత్తగా నమోదు చేసుకుంటేనే వచ్చే పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. పట్టభద్రుల ఎన్నికలకు 2020 నవంబరు 1 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు మాత్రమే ఓటు నమోదుకు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్‌లో సీఈఓ తెలంగాణ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో నేరుగా ఓటు నమోదు చేసుకునేందుకు దరఖాస్తులను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఫిబ్రవరి 24న ఓటరు ముసాయిదా జాబితాను ప్రచురిస్తామని.. ఆ జాబితాలపై మార్చి 14వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. మార్చి 29వ తేదీ వరకు అభ్యంతరాలను పరిశీలించి.. ఏప్రిల్ 4వ తేదీన తుది జాబితా విడుదల చేస్తామన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు కోసం ఇప్పటి వరకు 12 జిల్లాల పరిధిలో 77,579 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు.

22 వరకు ఓటరు నమోదుకు దరఖాస్తులు..

పార్లమెంట్ సాధారణ ఎన్నికల్లో భాగంగా 18 సంవత్సరాలు నిండినవారు ఈ నెల 22వ తేదీలోగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఆదివారం కూడా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఓటర్ల తుది జాబితా ఫిబ్రవరి 8న విడుదల చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ మోతిలాల్, ఎలక్షన్ డీటీ విజయ్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు క్యాంపెయిన్ తనిఖీ

నల్లగొండ : పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు క్యాంపెయిన్‌ను కలెక్టర్ హరిచందన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా అర్హులైన నూతన ఓటర్లను గుర్తించాలని ఓటర్లుగా నమోదుచేయాలని పేర్కొన్నారు. చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఆమె ఆర్డీఓ రవి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ప్రత్యేక క్యాంపెయిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

రైతు వేదిక స్థలంలో గుడిసెలు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఏఓ
- సర్వే చేసి హద్దు రాళ్లు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపలి రైతు వేదిక స్థలంలో గుడిసెలు వెలిశాయి. మండల కేంద్రంలో పచ్చర్లబావి సమీపంలో సర్వే నంబర్ 170లో 20 గుంటల స్థలాన్ని రైతువేదిక కోసం కేటాయించారు. అక్కడ రైతు వేదిక నిర్మాణం కూడా పూర్తయింది. పక్కన ఉన్న ఖాళీ స్థలంలో మండల కేంద్రానికి చెందిన కొంతమంది వ్యక్తులు నాలుగు రోజుల క్రితం అక్రమంగా గుడిసెలు వేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి (ఏఓ) వెంకన్న గుడిసెలు వేసిన వ్యక్తులతో మాట్లాడగా.. కొండమల్లేపల్లి సర్పంచ్, గ్రామ కార్యదర్శి చెప్తేనే గుడిసెలు వేసుకున్నామని చెప్పారు. ఇదే విషయాన్ని సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్ ఏఓ అడగగా రెండో రోజుల్లో గుడిసెలు ఖాళీ చేయిస్తామని చెప్పారు. ఈ విషయమై ఏఓ వెంకన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ దివ్యారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మండల సర్వేయర్ చేత సర్వే చేయించి హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. ఇక ముందు ఎవరైనా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ వెంకన్న తెలిపారు.



గుడిసెలు వేసిన వారితో మాట్లాడుతున్న పోలీసులు, అధికారులు

సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఎడమకాల్వ నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎడమకాల్వ పరిధిలోని ఆయకట్టులో బోర్లు, బావులు, చెరువుల కింద 30 శాతం వరి పంట సాగు చేశారని.. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటి చేతికొచ్చిన పంట ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 524 అడుగుల నీటిమట్టం ఉందని, అందులో 15టీఎంసీల నీటిని వాడుకునే అవకాశం ఉంటుందని.. మరోవైపు కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడం వల్ల అక్కడి ప్రభుత్వంతో మన ప్రభుత్వం చర్చలు జరిపి ఆల్మట్టి ద్వారా నీటిని తెప్పించాలని సూచించారు. అలా చేస్తే భవిష్యత్‌లో తాగునీటి సమస్య కూడా ఉండదని చెప్పారు. నీటి విడుదలపై ప్రభుత్వం స్పందించకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చెస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, ఎండీ.అంజద్, గుణగంటి రామచంద్ర, గుంటూరు వీరాచారి, పి.రామ్మూర్తి, రామారావు, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశపరీక్షకు 73.11 శాతం హాజరు



పెద్దవూరలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పెద్దవూర : మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు గాను శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 73.11 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ ఆర్.నాగభూషణం తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో యాదాద్రి భువనగిరి జిల్లాలో 5, సూర్యాపేటలో 8, నల్లగొండ జిల్లాలో 12 కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో 2,254 మందికి గాను 1,657 మంది (73.51శాతం), సూర్యాపేట జిల్లాలో 1,564 మందికి గాను 1,186 మంది (75.83శాతం), యాదాద్రి భువనగిరి జిల్లాలో 805 మందికి గాను 537 మంది (66.71శాతం) విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు. మొత్తం 80 సీట్లకు నిర్వహించిన ప్రవేశపరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,623 మంది విద్యార్థులకు గాను 3,380 మంది పరీక్షకు హాజరు కాగా 1,247 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఒక్క సీటుకు 42 మంది విద్యార్థులు పోటీ పడ్డారని తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమానికి ఎఫ్‌సీఐ ప్రాధాన్యం

నల్లగొండ : ఉద్యోగుల సంక్షేమానికి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, ఎఫ్‌సీఐ తెలంగాణ ప్రాంత జనరల్ మేనేజర్ జీఎస్.రాజు పేర్కొన్నారు. భారత ఆహార సంస్థ జిల్లా కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన శిశువిహార్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రసూతి ప్రయోజన చట్టం – 1961 ప్రకారం ఉద్యోగుల పిల్లల సంరక్షణకు ప్రభుత్వ కార్యాలయాల్లో శిశు విహార్‌ను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా తమ సంస్థ కార్యాలయాల్లో శిశువిహార్‌ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని, అతి తక్కువ సమయంలో శిశు విహార్‌ను ఏర్పాటు చేయడంలో చొరవ తీసుకున్న జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సంస్థ నల్లగొండ డివిజనల్ మేనేజర్ సుశీల్‌కుమార్‌సింగ్, ఏజీఎం డాక్టర్ రతీశ్‌చంద్రన్, మేనేజర్లు ప్రసాద్, రఘుపతి, రవికుమార్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.



శిశు విహార్‌ను ప్రారంభిస్తున్న రాజు

బీసీలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

నల్లగొండ టౌన్ : కేంద్ర బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేశ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును పెట్టాలని, కులగణన చేయాలని, పదోన్నతుల్లో బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్లు పెట్టాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లు కోసం అన్ని ప్రధాన పార్టీలను కలిసి మద్దతు కోరామని తెలిపారు. 76 సంవత్సరాలుగా బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందన్నారు. బీసీల డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 5, 6 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, గుండు వెంకటేశ్వర్లు, సింగం లక్ష్మి, బక్కతట్ల వెంకన్నయాదవ్, ఖమ్మంపాటి దుర్గ, వల్లకీర్తి శ్రీనివాస్, పగిళ్ల కృష్ణ, పున్న వీరేశం, వనం లలిత, సతీష్‌యాదవ్, సదానందం, మత్స్యగిరి, దశరథ, శివ, రమణ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు

- గ్రామాల్లో ఆదాయం, ఖర్చుల వివరాలతో నివేదిక సిద్ధం చేయాలన్న కేంద్రం
- ఆ ప్రకారమే ఖర్చు చేయాలని నిబంధన
- గ్రామసభల నిర్వహణకు సిద్ధమవుతున్న అధికారులు



నల్లగొండ : 2024–25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాభివృద్ధికి ప్రణాళికలు పంచాయతీ అధికారులు ప్రణాళికలకు సిద్ధం చేస్తున్నారు. పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక సంఘం నిధులు వస్తాయి. వాటితోపాటు పంచాయతీలకు ఏఏ మార్గాల ద్వారా ఆదాయం వస్తుంది? వచ్చిన ఆదాయాన్ని ఎలాంటి పనులకు ఖర్చు చేస్తారు అనే వివరాలతో ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసి పంపించాలని కేంద్రం నిబంధన పెట్టింది. అందులో భాగంగానే రాబోయే సంవత్సరానికి సంబంధించి ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపేందుకు సిద్ధమవుతున్నారు.

ఈ నెల 25లోగా గ్రామసభలు..

జిల్లాలో 844 గ్రామ పంచాయతీలున్నాయి. వాటిలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు గ్రామసభలు నిర్వహిస్తారు. ఈ గ్రామసభల్లోనే ఆయా గ్రామాల ఆదాయ, వ్యయాలపై వివరాలు సేకరిస్తారు. వచ్చిన నిధులను 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఏఏ పనులకు ఖర్చు చేస్తారో తెలుసుకుని ప్రణాళికలు సిద్ధం చేస్తారు. అయితే వచ్చే ఆదాయాన్ని బట్టి ఆయా గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, ఉపాధి పనులతో పాటు ఇతర పనుల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ అభివృద్ధి ప్రణాళికలో పొందుపరిచిన విధంగానే ఆయా పంచాయతీలు నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

31వ తేదీలోగా ఆన్‌లైన్..

ఈ నెల 25లోగా గ్రామ సభలు పూర్తి చేసిన గ్రామాల అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేస్తారు. 31వ తేదీలోగా ఆ ప్రణాళికలను గ్రామాల వారీగా ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నారు. ఆ తర్వాత బ్లాక్ స్థాయిలో (మండల) కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర పథకాల ద్వారా ఎన్ని నిధులు వస్తాయి.. ఏఏ పనులకు ఖర్చు చేస్తారో ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉంటుంది. మండల స్థాయిలో పూర్తయిన తర్వాత జిల్లాస్థాయిలో ఇదే తరహాలో ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుంది.

పక్కాగా రూపొందిస్తాం



ఈ నెల 25లోగా గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తాం. 2024–25 ఆర్థిక సంవత్సరంలో వచ్చే ఆదాయం, నిధులు.. ఖర్చుల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించి ప్రణాళికలు రూపొందిస్తాం. సిద్ధమైన ఈ ప్రణాళికలను ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తాం. మండల, జిల్లా స్థాయిలో కూడా పక్కాగా ప్రణాళికలు రూపొందిస్తాం.

– విష్ణువర్ధన్‌రెడ్డి, డీపీఓ

న్యూస్‌రీల్

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండ : జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై ఆయన అదనపు కలెక్టర్(రెవెన్యూ) జె.శ్రీనివాస్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరేడ్ గ్రౌండ్‌లో సీటింగ్, వేదిక ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓను ఆదేశించారు. జాతీయ సమగ్రత, దేశ భక్తిని చాటేలా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటు చేయాలని డీఈఓకు సూచించారు. ముఖ్య అతిథి సందేశంతో పాటు మెడికల్ క్యాంపు, 108 వాహనం ఏర్పాటు, పోలీస్ శాఖచే గౌరవ వందనం, బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధికి సంబంధించిన శకటాలు, స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ రవి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఓ కాళిందిని, సీపీఓ బాలశౌరి, డీఈఓ భిక్షపతి, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, డీపీఆర్‌ఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ రూరల్ : ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులకు గ్రూప్–1,2,3,4 పరీక్షల కోసం ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు ఈ నెల 24వ తేదీ వరకు గడువు పొడిగించామని, ఆసక్తి గల అభ్యర్థులు tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ మెమో, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫొటో, ఆధార్‌కార్డు, టీఎస్‌పీఎస్‌సీ ఓటీఆర్ దరఖాస్తులు స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో పొందుపరిచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 08682 220007 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26వ తేదీన జిల్లా కేంద్రాల్లో నిర్వహించబోయే ట్రాక్టర్, వాహనాల ర్యాలీని విజయవంతం చేయాలని ఎంసీపీఐ యూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 80కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన మగ్గిపోతున్నా.. పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లచట్టాలను ఉపసంహరించుకుంటామని చెప్పిన ప్రధాని మాట తప్పారని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మోహన్‌నాయక్, వస్కుల సైదమ్మ, వస్కుల గోపి, కాశి, కిరణ్, వీరన్న, ఆశీర్వాదం, జ్యోతి, సందీప్, భరత్ తదితరులున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



చెంచోనితండాలో వీధులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు సూచించారు. తిరుమలగిరి(సాగర్) మండలంలోని చెంచోనితండాలో శనివారం నిర్వహించిన హెల్త్‌క్యాంపులో ఆయన మాట్లాడారు. మనతో పాటు మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాల బారిన నుంచి బయటపడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా తండావాసులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయన వెంట పీడీ రాజ్‌కుమార్, ఎంపీటీసీ సుజాత, డాక్టర్లు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

చౌటుప్పల్ : అనారోగ్య కారణాలతో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని దేవలమ్మనాగారం గ్రామంలో చోటుచేసుకుంది. దేవలమ్మనాగారానికి చెందిన పిల్లలమర్రి స్రవంతి(33) గృహిణి. ఆమె భర్త నరహరి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల తలెత్తిన అనారోగ్య కారణాల మూలంగా స్రవంతి శుక్రవారం అర్ధరాత్రి దాటాక తన ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించేలోపే ఆమె మృతిచెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.

గడ్డి మందు తాగిన యువకుడు మృతి


మహేష్ (ఫైల్)

రామగిరి(నల్లగొండ): గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. తిప్పర్తి మండలం చిన్నాయిగూడేనికి చెందిన బైరబోని మహేష్ (26) డిగ్రీ పూర్తి చేశాడు. నల్ల గొండలో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ అక్కడే గది అద్దెకు తీసుకుని మిత్రులతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 17న నల్లగొండలో ఉంటున్న గదిలో ఎవరూ లేని సమయంలో మహేష్ గడ్డి మందు తాగాడు. అనంతరం విషయాన్ని మిత్రుడికి ఫోన్ చేసి చెప్పగా వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే మహేష్‌ను నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 11గంటలకు మృతిచెందాడు. మహేష్ అవివాహితుడు. ఇతడి ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణం కావచ్చని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

ఆటో అపహరించిన వ్యక్తి అరెస్ట్


పట్టుబడిన నిందితుడితో పోలీసులు

కొండమల్లేపల్లి : ఇంటి ఎదుట నిలిపిన ఆటోను అపహరించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన మూఢావత్ సుక్య ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సుక్య ఈ నెల 16న రోజూ మాదిరిగా ఆటోను తన ఇంటి ఎదుట నిలిపి నిద్రపోయాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆటోను అపహరించుకుపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల 18న వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు కొల్‌ముంతలపహాడ్ గ్రామ సమీపంలో ఆటోను గుర్తించి డ్రైవర్ చింతపల్లి మండలం గడియగౌరారం గ్రామానికి చెందిన కొప్పుల మహేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించాడని సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ వీరబాబు, సిబ్బంది హేమనాయక్, వెంకటేశ్‌లను సీఐ అభినందించారు.

వైద్య రంగానికి కేంద్రం పెద్దపీట


ఎయిమ్స్‌ను పరిశీలిస్తున్న కేంద్ర విద్యుత్ పునరుత్పాదక, ఇంధన శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్


ముద్ర యోజన పథకం కింద లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కేంద్ర మంత్రి

- భారత్‌ను మహాశక్తిగా తీర్చిదిద్దడమే మోదీ లక్ష్యం
- కేంద్ర విద్యుత్ పునరుత్పాదక, ఇంధన శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్

బీబీనగర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తోందని కేంద్ర విద్యుత్ పునరుత్పాదక, ఇంధన శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్ పేర్కొన్నారు. అందులో భాగంగానే జిల్లా స్థాయి ఆస్పత్రులతో పాటు రూరల్ హెల్త్ సెంటర్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.బీబీనగర్‌లోని ఎయిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.భారత్‌ను మహాశక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మోదీ సర్కార్ పనిచేస్తోందని చెప్పారు.పేదలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కేంద్రం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని పేర్కొన్నారు. 3వేల కోట్ల మందికి ఇళ్లు నిర్మించి ఇచ్చామని తెలిపారు. జీడీపీలో దేశం మూడో స్థానంలో ఉందని, ఆయుష్మాన్ భారత్ ద్వారా 5లక్షల ఆరోగ్య బీమా కల్పించినట్లు చెప్పారు. ముద్ర పథకం ద్వారా ఎంతో మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వివిధ బ్యాంక్‌ల నుంచి ముద్ర స్కీం ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారుల అనుభవాలను ఆయన పంచుకున్నారు. వివిధ బ్యాంక్‌ల ద్వారా పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు అందజేశారు. అలాగే కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ రూపొందించిన నూతన క్యాలెండర్, బ్రోచర్లతో పాటు బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఖాతాదారులకు బ్యాంకులు కల్పిస్తున్న స్కీంల గురించి వివరించేలా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

అంతకుముందు కేంద్ర మంత్రికి ఎయిమ్స్ డైరెక్టర్ ఆర్‌కే సింగ్‌కు ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియాతో పాటు మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్, వైద్యులు ఘన స్వాగతం పలికారు. ఎయిమ్స్ పురోగతి, వైద్య సేవలపై డైరక్టర్‌తో మంత్రి చర్చించారు.ఎయిమ్స్‌లో అందుతున్న వైద్య సేవలు, జరుగుతున్న నిర్మాణాల గురించి డైరెక్టర్ కేంద్ర మంత్రికి వివరించారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఎంపీపీ సుధాకర్‌గౌడ్, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీవాణి, ఏంపీఓ స్వాతి, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్‌ల జనరల్ మేనేజర్లు రితేష్, రకుల్‌కుమార్, శాంతికుమార్ పాల్గొన్నారు.

థర్మకోల్‌తో అయోధ్య రామ మందిరం

- అబ్బుర పరిచిన విద్యార్థి హృతిక్ గౌడ్ నైపుణ్యం


థర్మకోల్‌తో తయారు చేసిన రామ మందిరంతో హృతిక్ గౌడ్

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన గనగాని అనిల్, పావని దంపతుల చిన్న కుమారుడు గనగాని హృతిక్ గౌడ్ థర్మకోల్‌తో అయోధ్య రామ మందిరాన్ని తయారు చేసి అబ్బుర పరిచాడు. 5వ తరగతి వరకు స్థానిక అక్షర ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో చదివిన హృతిక్ ప్రస్తుతం కీసర ఎస్ఆర్ ప్రాథమిక పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన విద్యార్థి థర్మకోల్‌తో రామ మందిరం నిర్మాణం చేసి ప్రతిభ చాటుకున్నాడు. పలువురు విద్యార్థి నైపుణ్యాన్ని అభినందిస్తున్నారు.

బంగారంతో శ్రీరాముడికి సూక్ష్మపాదాలు


స్వామి వారి పాదాలు


శ్రీనివాసచారి

నార్కట్‌పల్లి : అయోధ్యలో ఈ నెల 22న రామ మందిరం ప్రారంభం సందర్భంగా నార్కట్‌పల్లికి చెందిన స్వర్ణకారుడు శ్రీనివాసచారి 00.130 మిల్లీ గ్రాముల బంగారంతో శ్రీరాముడికి సూక్ష్మపాదాలు తయారు చేశాడు. ఒక్కో పాదం 8 ఎం ఎం పొడవు, 4 ఎం ఎం వెడల్పుతో గంట వ్యవధిలోనే తయారు చేసినట్లు శ్రీనివాసచారి పేర్కొన్నాడు. శ్రీరాముడిపై ఉన్న భక్తితో సూక్ష్మ పాదాలు తయారు చేసినట్లు తెలిపాడు. గతంలో బియ్యపు గింజపై జాతీయ జెండాను ఆవిష్కరించినట్లు పేర్కొన్నాడు.

కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కు అవార్డు



అవార్డు అందజేస్తున్న ఏరువాక ఫౌండేషన్ ఫౌండర్ రాఘవరావు



శేషుకుమార్‌కు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

గరిడేపల్లి : రైతులకు విశేష సేవలు అందించినందుకు గాను గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కు ఏరువాక వ్యవసాయ వార్షిక అవార్డు దక్కింది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పద్మశ్రీ చింతల వెంకట్‌రెడ్డి, ఏరువాక ఫౌండేషన్ ఫౌండర్ గారా రాఘవరావు చేతుల మీదుగా శాస్త్రవేత్త కిరణ్‌కు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి కృషి చేసిన వారికి ఇచ్చే గొప్ప గౌరవమన్నారు.

సిరిపురం రైతుకు రాష్ట్రస్థాయి పురస్కారం

నడిగూడెం: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు వాసికర్ల శేషుకుమార్‌కు శనివారం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలో ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ సేంద్రియ రైతు పురస్కారాన్ని అందజేశారు. పద్మశ్రీ డాక్టర్ చింతల వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి ఐసీఏఆర్ మాజీ డైరక్టర్ డాక్టర్.బి.వెంకటేశ్వర్లు, వీసీ డాక్టర్.వీఎస్‌కె.రెడ్డి, రిజిస్ట్రార్ ఎం.ఆంజనేయులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యారాధనలు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి నిత్యారాధనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజామున సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూల విరాట్‌స్వామికి పంచామృతాభిషేకం చేశారు. ప్రధానాలయంలోని ముఖమండపంలో నూతన పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం నిత్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించి స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

తలనీలాల హక్కుకు 24న బహిరంగ వేలం

మట్టపల్లి క్షేత్రంలో తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు ఈనెల 24న దేవాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.4లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఉట్లపల్లిలో బత్తాయి మొక్కల నరికివేత

- అనుమానితులపై పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు


నరికివేసిన బత్తాయి మొక్కలను చూపుతున్న బాధిత రైతు మల్లయ్య

పెద్దవూర: పెద్దవూర మండలంలోని ఉట్లపల్లి గ్రామంలో ఓ రైతు పెంచుతున్న బత్తాయి మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్లపల్లికి చెందిన బోదాసు మల్లయ్యకు గ్రామ శివారులో సర్వే నంబర్ 291లో గల వ్యవసాయ భూమిలో 230 బత్తాయి మొక్కలు నాటాడు. ఈ భూమిని ఆనుకుని గ్రామానికి చెందిన భూతరాజు సాయన్న వ్యవసాయ భూమి ఉంది. 19 ఏళ్ల క్రితం బోదాసు మల్లయ్య భూమిలో ఉండాల్సిన దానికంటే 30 గుంటలు(ముప్పావు ఎకరం) ఎక్కువగా ఉందని 2005 సంవత్సరంలో సర్వేయర్‌తో కొలతలు వేశారు. దీంతో 31 గుంటల భూమి ఎక్కువ తేలడంతో అప్పట్లోనే గ్రామ పెద్దమనుషులు సాయన్నకు రూ.14వేలు ఇప్పించారు. అప్పటితో ఈ సమస్యకు తెర పడింది. ధరణి రాకతో బోదాసు మల్లయ్యకు చెందిన 31గుంటల భూమి మళ్లీ సాయన్న భూరికార్డులోకి ఎక్కింది. దీంతో బత్తాయి మొక్కలు నాటినప్పటినుంచి వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బోదాసు మల్లయ్యకు చెందిన 170 బత్తాయి మొక్కలను గొడ్డళ్లతో నరికి వేశారు. శనివారం ఉదయం మల్లయ్య తన బత్తాయి తోట వద్దకు వెళ్లగా మొక్కలు నరికివేసి ఉన్నాయి. దీంతో బాధితుడు అనుమానితులపై పెద్దవూర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

లారీ ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

పాలకవీడు: లారీ ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతిచెందాడు. పాలకవీడు మండల పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకవీడు మండలం గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన పాపుగంటి దేవదానం(56) కొంత కాలం క్రితం మతిస్థిమితం కోల్పోయి రోడ్ల వెంట తిరుగుతున్నాడు. ఈ క్రమంలో శనివారం గ్రామ శివారులోని శివాలయం సమీపంలోని రోడ్డుపై ఉన్న ఇతడిని జాన్‌పహాడ్ వైపు నుంచి నేరేడుచర్ల వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో దేవదానం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్తులు లారీని నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు


ఘటనాస్థలిలో సహాయక చర్యలు చేపడుతున్న స్థానికులు

రామన్నపేట : కంటైనర్ ఢీకొట్టడంతో యువకుడికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన శనివారం రామన్నపేట మండలకేంద్రంలో జరిగింది. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం రాజన్నగూడేనికి చెందిన పరమేష్ బైక్‌పై రామన్నపేట నుంచి నల్లగొండ వైపు వెళ్తుండగా సబ్‌స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న కంటైనర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పరమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

తేనెటీగల పెంపకంపై రేపటి నుంచి ఉచిత శిక్షణ

గరిడేపల్లి : శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై కేవీకే గడ్డిపల్లిలో ఈ నెల 22, 23వ తేదీల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కేవీకే ఇంచార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ నరేష్ తెలిపారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. అసక్తి కల్గిన విద్యార్థులు, యువత, రైతులు, ఆధార్‌కార్డుతో తమ పేర్లను నేరుగా కేవీకేలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉచితంగా భోజనం, వసతి సదుపాయం అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకోవాలనుకునే వారు 10వ తరగతి వరకు చదివి ఉండాలని తెలిపారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక


కప్‌తో విద్యార్థులు నితిన్, నిఖిల్

డిండి: మండల పరిధిలోని చెర్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నితిన్, ఎన్.నిఖిల్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం రాంరెడ్డి తెలిపారు.విద్యార్థులు నిఖిల్, నితిన్ ఇటీవల జనగామలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచారని తెలిపారు. వీరు ఈ నెల 24వ తేదీ నుంచి 28 వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు శనివారం అభినందించారు. కార్యక్రమంలో ఉపధ్యాయులు లెనిన్‌బాబు, తిర్పతయ్య, జయరాజు, శోభన్‌బాబు, లాల్‌సింగ్, రహూఫ్, సృజన, రమాదేవి, ప్రభావతి, ధనమ్మ ఉన్నారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు

మర్రిగూడ : మహిళపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై శనివారం మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండల పరిధిలోని చాకలిశేరుపల్లి గ్రామానికి చెందిన సిలివేరు నాగమ్మ పదేళ్ల క్రితం భర్త యాదయ్యతో గొడవపడి మర్రిగూడ మండలంలోని కొండూరు గ్రామంలోని పుట్టింటికి వచ్చి ఉంటుంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి నాగమ్మ గాయాలతో ఇంటి వద్ద పడి ఉండడాన్ని స్థానికులు గమనించారు. వెంటనే నాగమ్మ కూతురు శిరీషకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి తల్లిని మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తోంది. గ్రామానికి చెందిన మల్లేష్ తన తల్లిపై దాడి చేసి గాయపరిచాడని శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.

భూ తగాదాలతో వ్యక్తిపై దాడి

మాడుగులపల్లి : భూతగాదాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ముగ్గురు దాడికి పాల్పడ్డారు. మాడుగులపల్లి మండలంలోని గజలాపురం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గజలాపురం గ్రామానికి చెందిన జక్క నాగయ్యకు అదే గ్రామానికి చెందిన ముద్దం మహేష్‌కు మధ్య కొన్నిరోజులుగా ఇంటిస్థలం విషయంలో వివాదం నడుస్తోంది. ఇదే విషయంలో శనివారం ఇద్దరి మధ్య మరోమారు గొడవ జరిగింది. దీంతో విచక్షణ కోల్పోయిన మహేష్ అతడి సమీప బంధువులిద్దరితో కలిసి నాగయ్యపై దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

చనిపోతూ మరో ఇద్దరికి ప్రాణదానం

- బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం


దుర్గయ్య (ఫైల్)

శాలిగౌరారం: ఓ వ్యక్తి తాను చనిపోతూ మరో ఇద్దరికి ప్రాణదానం చేశాడు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన అల్లి దుర్గయ్య(54)కు భార్య, వివాహితులైన ఇద్దరు చొప్పున కుమార్తెలు, కుమారులు ఉన్నారు. దుర్గయ్య వృత్తిరీత్యా మత్స్యకారుడు. మూసీ ప్రాజెక్టులో చేపలు పట్టుకుని విక్రయించి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వివాహితులైన కుమారులు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం దుర్గయ్య బాత్‌రూంలో రక్తపోటుకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు దుర్గయ్యను తొలుత నకిరేకల్‌లోని ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గయ్య బ్రెయిన్ శుక్రవారం అర్ధరాత్రి డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు దుర్గయ్య అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. జీవన్‌ధాన్ ఫౌండేషన్‌కు సమాచారం అందించడంతో వారు దుర్గయ్యకు సంబంధించిన కాలేయం, కళ్లను సేకరించి అవసరాలు కలిగిన మరో ఇద్దరికి అమర్చి ప్రాణం పోశారు. శనివారం సాయంత్రం గ్రామంలో దుర్గయ్య అంత్యక్రియలు జరిగాయి.